ఎక్కడి చెత్త అక్కడే..


రోడ్డు పక్కనే ఉన్న పిచ్చిమొక్కలు


పాఠశాల ఎదుట ఉన్న చెత్తాచెదారం

- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

ఏటూరునాగారం: మేజర్ గ్రామ పంచాయతీ ఆరో వార్డులోని మురుగు కాల్వలు అధ్వానంగా మారాయి. రోడ్లపై ఉన్న చెత్తాచెదారం ఎక్కడబడితే అక్కడే దర్శనమిస్తోంది. పశువులు ప్లాస్టిక్‌ను తిని మృత్యువాత పడుతున్నాయి. గ్రామ పంచాయతీ అధికారులు, కార్యాలయం సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడంతో కాల్వల్లో చెత్తా పేరుకుపోతోంది. అంబేడ్కర్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలకు సమీపంలో ఉన్న కాల్వల్లో మోకాలిలోతు చెత్తాచెదారం పేరుకుపోయింది. కాల్వల్లో చెత్తాచెదారం శుభ్రం చేసేందుకు సరైన సిబ్బంది లేక పంచాయతీ పాలన నీరుగారిపోతుంది. అంతేకాకుండా గ్రామ పంచాయతీకి ఉన్న ట్రాక్టర్ ట్రాలీ సైతం తుప్పు పట్టి పోవడంతో చెత్తాచెదారం వేయడానికి సరైన ట్రాలీని కూడా పంచాయతీ అధికారులు సమకూర్చడం లేదు.

ప్రత్యేక పాలన అధ్వానం

సర్పంచ్‌ల పదవి కాలం ముగిసి రెండేళ్లు దగ్గరికి వస్తున్నా ఇంత వరకు ఎన్నికలు జరగకపోవడంతో ప్రత్యేక పాలన అధ్వానంగా మారింది. గ్రామ పంచాయతీ అధికారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. చెట్లను నరికివేసి రోడ్లపైనే పడవేయడంతో రోడ్లపై వాహనాలు నడిచే పరిస్థితి లేకుండా పోయింది. వర్షాకాలం కావడంతో వర్షపు నీరు సైతం కాల్వల్లో నిండి ఇళ్లలోకి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కాల్వల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించి ప్రజల ఇబ్బంది తొలగించాలి.


6వ వార్డులోని కాల్వల్లో ఉన్న చెత్తాచెదారం

కాల్వలు శుభ్రం చేయాలి



పాఠశాల ముందు ఉన్న కాల్వలు అధ్వానంగా చెత్తాచెదారంతో నిండి ఉన్నాయి. దానివల్ల దుర్వాసన వస్తుంది. గ్రామ పంచాయతీ సిబ్బంది, అధికారులు స్పందించి కాల్వలో చెత్తాచెదారం తొలగించి నీరు సరఫరా అయ్యే విధంగా చూడాలి. పిల్లలు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వెంటనే స్పందించి శుభ్రం చేయాలి.

\- సోలం సత్యం, హెచ్‌ఎం

చెత్తాచెదారం తొలగించాలి



గ్రామంలోని వార్డుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించాలి. రోడ్లు, కాల్వలను శుభ్రం చేయకపోవడం వల్ల దోమలు మరింత పెరిగాయి. కాల్వల్లో చెత్తాచెదారం వల్ల ఇళ్లలోని నీరు బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా పోతుంది. దానివల్ల వ్యాధులు వస్తున్నాయి. రాత్రివేళలో దోమల బెడద ఎక్కువగా ఉంది. కాల్వలు, రోడ్లు శుభ్రం చేసి ఆదుకోవాలి.

\- జనగాం లక్ష్మయ్య, ఏటూరునాగారం

రమేశ్ మృతికి కారకులను శిక్షించాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, పక్కన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌బాబు

- మాజీ ఎమ్మెల్యే పెద్దిసుదర్శన్‌రెడ్డి

ములుగు రూరల్: ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అర్హుడై ఉండి ఇల్లు రాకపోవడంతో సామాజిక మాధ్యమాలలో ప్రశ్నించిన యువకుడు చుక్క రమేశ్ మృతికి కారణమైన కాంగ్రెస్ గుండాలను కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే పెద్దిసుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో రమేశ్ మృతదేహాన్ని సందర్శించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుల ఆగడాలు రోజు రోజుకు మితిమీరి పోతున్నాయని ఆరోపించారు. ఇందిరమ్మ ఇంటి విషయం, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్‌పై సామాజిక మాధ్యమాలలో వచ్చిన వార్తను వాట్సప్ గ్రూప్‌లో పోస్టు చేసిన కారణంగా యువకుడిని బెదిరించి పోలీస్‌లతో భయభ్రాంతులకు గురి చేయడంతో మనోవేదనకు గురై యువకుడు ఉరి వేసుకోని మృతి చెందాడని తెలిపారు. యువకుడి మృతికి రాష్ట్ర పంచాయితీరాజ్‌శాఖ మంత్రి సీతక్క బాధ్యత వహించాలని అన్నారు. రమేష్ కుటుంబానికి ప్రభుత్వం రూ. కోటిని ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి యువకుడి మృతికి సంతాపం తెలిపేందుకు వస్తున్న క్రమంలో అక్రమంగా అరెస్టు చేశారని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేష్‌రెడ్డి, పోరిక గోవింద్‌నాయక్, భూక్య జంపన్న, చెన్న విజయ్‌కుమార్, ఆకుతోట చంద్రమౌళి, చీదర్ల సంతోష్, భిక్షపతి, కోయిల మహేష్, తుమ్మల హరిబాబు, పిన్నింటి మధుకర్ రెడ్డి, పాలెపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- ఎస్సై చల్ల రాజు

వెంకటాపురం(ఎం): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎస్సై చల్ల రాజు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని లక్ష్మీదేవిపేట పాఠశాల ఆవరణలో ఎంపీఓ శ్రీనివాస్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మానవ మనుగడకు మొక్కలే జీవనధారమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలు తమ ఇంట్లో మొక్కలు నాటుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు సర్వర్ అహ్మద్, నాయకులు కారుపోతుల యాదగిరి, కొండ తిరుపతి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న ఎస్సై రాజు

కాచి చల్లార్చిన నీటిని తాగాలి


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి ప్రశాంత్

మంగపేట: ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని ఎంసీహెచ్ మొబైల్ టీం వైద్యాధికారి ప్రశాంత్ అన్నారు. మండలంలోని చుంచుపల్లి పీహెచ్‌సి పరిధిలోని నర్సింహాసాగర్, గొంది గూడెంలో ఎంసీహెచ్ మొబైల్ టీం వైద్యాధికారి ప్రశాంత్ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 77 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 11 మంది జ్వరపీడితులను గుర్తించి వారికి రక్త పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. వర్షాకాలంలో వ్యాప్తి చెందే సీజనల్ వ్యాధులు, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ పద్మ, ఏఎన్‌ఎం సారమ్మ, స్టాఫ్ నర్స్ అమరావతి, ఆశకార్యకర్తలు అనిత, శ్రీలత పాల్గొన్నారు.

'వేధింపులు తాళలేకనే ఆత్మహత్య'

ములుగు రూరల్: ఇందిరమ్మ ఇళ్ల అవకతవకలపై గోవిందరావుపేటకు చెందిన రమేశ్ అనే యువకుడు ప్రశ్నించడంతో కాంగ్రెస్ నాయకులు వేధింపులకు గురి చేశారని వేధింపులు తట్టుకోలేకను రమేశ్ ఆత్మహత్య చేసుకున్నాడని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు రమేశ్‌ను బెదింపులకు పాల్పడటంతో పాటు అక్రమ కేసులు బనాయించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేందర్, రవిరెడ్డి, నాగరాజు, శ్యామ్ ప్రసాద్, రాకేష్ తదితరులు ఉన్నారు.

విచారణ జరిపించాలి

గోవిందరావుపేట: ఇందిరమ్మ ఇల్లు రాలేదని సోషల్ మీడియాలో మేసేజ్ చేసిన రమేశ్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు భయభ్రాంతులకు గురి చేయడంతో ఆత్మహత్య చేసుకున్నాడని దినిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొదిల్ల చిట్టిబాబు, మండల కార్యదర్శి సోమ మల్లారెడ్డి పేర్కొన్నారు. గురువారం వారు మాట్లాడుతూ.. రమేశ్ మృతికి కారణమైన వారిని గుర్తించి శిక్షించాలని అన్నారు. వారి వెంట మండల కమిటీ సభ్యుడు గుండు రామస్వామి, మోటెం సాంబయ్య తదితరులు ఉన్నారు.

చర్య తీసుకోవాలి


సమావేశంలో పాల్గొన్న నాయకులు

కన్నాయిగూడెం: ఆధారాలు లేకుండా మంత్రి సీతక్క, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్‌పై కొన్ని పత్రికలు అనుచిత వ్యాఖ్యలతో వార్తలు రాస్తున్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అప్సర్ పాషా, మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ కర్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలో ఎన్నడు లేని విధంగా అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక ప్రతీ పక్ష పార్టీలు పనికట్టుకోని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సునార్కని రాంబాబు, గడ్డం నాగేష్, తాటి రాజబాబు, బోట నాగేష్, చలపతి, సుమణ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

వెంకటాపురం(కె): ఎదిర వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కంకలవాగుపై బైఠాయించి గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి గ్యానం వాసు మాట్లాడుతూ.. ఎదిర గ్రామ సమీపంలోని రాళ్లవాగు వంతెన కుంగిపోయి నెలలు గుడుస్తున్న అధికారులు ఇప్పటి వరకు వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో గిరిజన గ్రామాల ప్రజలు, విద్యార్థులు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వంతెన వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు చిన్న వర్షానికి బురదమయంగా మారుతుందని, దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోయారు. కాగా వెంకటాపురం, వాజేడు మండలాలకు రావాల్సిన ఆర్టీసీ బస్సులను భద్రాచలం డిపో అధికారులు నిలిపి వేశారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎదిర గ్రామం వరకు మండల కేంద్రం నుంచి బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై తిరుపతి రావు సంఘటన ప్రాంతానికి చేరుకోని ఆందోళన కారుతో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నట్ల నర్సింహాచారి, చిట్టెం ఆదినారాయణ, కోగిల మాణిక్యం, ఆనంద్, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి

- వైద్యాధికారిని యోషిత

వాజేడు: గర్భిణులు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని పేరూరు వైద్యాధికారిని యోషిత అన్నారు. మండల పరిధిలోని పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం గర్భిణులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులకు పలు జాగ్రత్తలను వివరించారు. సుఖ ప్రసవం కోసం చిన్న పాటి వ్యాయామాలను తప్పనిసరిగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రమ, అనూష, శకుంతల, సుమలత ఉన్నారు.


పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిని యోషిత

ఎన్యుమరేటర్ల వేతనాలు చెల్లించాలి

మంగపేట: మండలంలో కుటుంబ సర్వే నిర్వహించిన ఎన్యుమరేటర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ సర్వే నిర్వహించిన ఎన్యుమరేటర్లు ఎంపీడీఓ భద్రుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 2024 నవంబర్‌లో నిర్వహించిన సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల గణన సమగ్ర సర్వేలో భాగంగా ఇంటింటికి తిరిగి ఎన్నో ఇబ్బందికర సమస్యలను ఎదుర్కొని సమర్థవంతంగా సర్వే నిర్వహించామన్నారు. వెంటనే సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమ వేతనాలను చెల్లించే విధంగా చర్య తీసుకోవాలని కోరారు.


వినతిపత్రం అందజేస్తున్న ఎన్యుమరేటర్లు

ఆలయ అభివృద్ధికి కృషి

- కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సూర్య

ఏటూరునాగారం: షిర్డి సాయిబాబా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా అని కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకుడు సూర్య అన్నారు. మండల కేంద్రంలోని షిర్డి సాయిబాబా ఆలయంలో ఈనెల 6న మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం కరపత్రాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాయిబాబా ఆలయ అభివృద్ధికి దోహదపడుతామన్నారు. అనంతరం కుట్టు మిషన్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో మహిళలతో మాట్లాడారు. మహిళలు ఎప్పుడు కూడా వెనుకడుగు వేయొద్దని, ప్రతి ఒక్కరు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇర్సవడ్ల వెంకన్న, ఎర్రబెల్లి మనోజ్, చిటమట రఘు, వసంత శ్రీనివాస్, వెలగందుల మాధవ్, చిందుకురి వెంకట్రావు, భిక్షపతి, ఎల్లయ్య, లాలయ్య, నర్సింగరావు, లక్కి పాల్గొన్నారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న సూర్య

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ములుగు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన జేడిమల్లంపల్లి-దేవనగర్ క్రాస్ వద్ద గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. ముద్దునూరితండాలో ఆంధ్ర మేస్త్రీ వద్ద భవన నిర్మాణ పని నిమిత్తం వచ్చిన కేరళకు చెందిన వ్యక్తి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ద్విచక్రవాహనంపై మల్లంపల్లికి వస్తున్న క్రమంలో దేవనగర్ క్రాస్ వద్ద మల్లంపల్లి నుంచి ఖమ్మం వెళుతున్న స్కార్పియో వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు సమాచారం. ఈ విషయంపై ఎస్సైని సమాచారం కోరగా తమ దృష్టికి రాలేదని తెలిపారు.

స్తంభాన్ని ఢీకొన్న టాటా మ్యాజిక్

వాహనం అదపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న సంఘటన మండలంలోని జంగాలపల్లిక్రాస్ రోడ్డులో చోటు చేసుకుంది. తెలిసిన వివరాలు వెంకటాపురంమండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన పసుల జగదీశ్ టాటా మ్యాజిక్ వాహనం నడుపుతూ ములుగు వస్తున్నాడు. ఈ క్రమంలో వాహనం అదపుతప్పి స్తంభాన్ని ఢీ కొనడంతో గాయాలయ్యాయి.

గుడుంబా పట్టివేత.. ఇద్దరి అరెస్ట్

వెంకటాపురం(కె): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న గుడుంబాను గురువారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై కొప్పుల తిరుపతి రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ నుంచి ఆటోలో అక్రమంగా గుడుంబా తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పీఎస్సైలు తిరుపతి రెడ్డి, సాయికృష్ణ సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకోని తనిఖీలు చేయగా వారి వద్ద నుంచి 360 లీటర్ల గుడుంబా లభించింది. దీంతో గుడుంబాను, ద్విచక్రవాహనం, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. గొల్లగూడెం గ్రామానికి చెందిన కన్నెబోయిన మల్లేష్, కమాపురం గ్రామానికి చెందిన నిమ్మల మనోజ్‌లను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.


పోలీసుల అదుపులో నిందితులు

బాధిత కుటుంబానికి పరామర్శ

వెంకటాపురం(ఎం): మండల కేంద్రానికి చెందిన తడుక సాంబయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బైరి రవికృష్ణ గురువారం పరామర్శించారు. మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. సంఘ నాయకులు చింతనిప్పుల భిక్షపతి, మెట్టు సురేష్, తడుక సుమన్, పోశాల భిక్షపతి తదితరులు ఉన్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

వెంకటాపురం(ఎం): మండలంలోని జవహర్ నగర్ మోడల్‌స్కూల్, కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణ తెలిపారు. గురువారం ఆయన పాఠశాలలో విలేకరులతో మాట్లాడారు. కళాశాలలో పీజీటీ కామర్స్, ఇంగ్లీషు పోస్టుకు సంబంధించి పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. పీజీ, బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 7న పాఠశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు. గతంలో మోడల్‌స్కూల్‌లో బోధించిన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు.

నేడు దొడ్డి కొమురయ్య వర్ధంతి

ములుగు రూరల్: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని జిల్లా కేంద్రంలో నేడు(శుక్రవారం) నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుబడిన తరగతుల అభివృద్ధి అధికారి సర్ధార్‌సింగ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని సంక్షేమ భవన్‌లో వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అధికారులు, యాదవసంఘం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దోమల నివారణ మందు పిచికారీ


పిచికారీ చేస్తున్న సిబ్బంది

కన్నాయిగూడెం: మండలంలోని సర్వాయి, రాజన్నపేట సబ్‌సెంటర్ పరిధిలోని గ్రామాల్లో వైద్యులు అభినవ్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం దోమల నివారణ మందు పిచికారీ చేశారు. దోమల వలన కలుగు అనర్థాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ అన్విష, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత


సమ్మె నోటీస్ అందజేస్తున్న కార్మికులు

వెంకటాపురం(కె): వెంకటాపురం మేజర్ పంచాయతీ కార్మికులు గురువారం సమ్మె నోటీస్‌ను కార్యదర్శి ప్రవీణ్‌కు అందజేశారు. ఈ నెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెలో పంచాయతీ కార్మికులు పాల్గొంటున్నట్లు నోటీస్‌లో తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు తాటి శ్రీను, దేవర కొండ ధనలక్ష్మి, లక్ష్మణరావు, రంజిత్, తదితరులు ఉన్నారు.

పోడు రైతులను మోసం చేయొద్దు

ఏటూరునాగారం: మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామంలో పోడు రైతులను మోసం చేయొద్దని, వారి భూముల్లోనే పండ్లను మొక్కలు నాటి వారికి అప్పగించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. గురువారం మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామ పంచాయతీలో ప్రజలతో ఆయన మాట్లాడారు. భూముల సాగు కోసం మంత్రితో రైతులను కల్పించి సమస్యను పరిష్కరించే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నరసింహరావు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు చేల వినయ్, ఏటూరునాగారం టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కుంభం శ్రీనివాస్ , ఠాగూర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నేడు సభకు తరలిరావాలి

హైదరాబాద్‌లో నేడు(శుక్రవారం) నిర్వహించే బహిరంగ సభకు పెద్ద ఎత్తున నాయకులు తరలిరావాలని రఘు తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే నేరుగా నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతారన్నారు.

జీఓ 49ని రద్దు చేయాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వాజేడు: ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొట్టే జీఓ 49ను రద్దు చేయాలని కోరుతూ తహసీల్దార్ శ్రీనువాస్‌కు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జెజ్జరి దామోదర్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అడవులు, అడవి జంతువుల పరిరక్షణ పేరుతో జీఓ నంబర్ 49ని తీసుకురావడం దారుణమన్నారు. నాగేశ్వరరావు, రామ కృష్ణ ఉన్నారు.